క్లుప్తంగా

గృహకల్ప సమస్యల పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



తెనాలిఅర్బన్: చంద్రబాబునాయుడు కాలనీలోని రాజీవ్ గృహ కల్ప సముదాయంలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. మంగళవారం రాజీవ్ గృహ కల్పను ఆమె పరిశీలించారు. అక్కడ నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, దానిని బాగు చేయించాలని స్థానికులు కోరారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణ లోపించిందని చెప్పారు. సెప్టిక్‌ట్యాంక్‌కు రంధ్రాలు పడటం వలన దుర్గంధభరితంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలన్నీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. ఆమె వెంట 24వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పెదలంక వెంకటేశ్వరరావు, సుబ్రమణ్యం ఉన్నారు.

చీడపీడలను గమనిస్తూ ఉండాలి



తెనాలిరూరల్: వరిలో వచ్చే చీడపీడలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ఉండాలని మండల వ్యవసాయశాఖాధికారి జి. ప్రేమ్‌సాగర్ రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం సోమసుందరాపాలెం, కంచర్లపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం పర్యటించారు. పొలాలను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్, జీవ ఎరువులు వాడాలని సూచించారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతంల గురించి వివరించారు. క్షేత్ర సందర్శనకు వెళ్లి పొలాలను పరిశీలించగా చీడపీడలు, నాము తెగులు, సుడిదోమను గుర్తించి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరిన్‌ట్రినిపోల్ 60 ఎంఎల్ ఒక ఎకరాకు 20 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలన్నారు. దోమ పోటుకు పైమెట్రోజైన్ 0.6 గ్రాములు, ట్రిఫ్లూమిజోఫైరిన్ 0.486 ఎంఎల్, డైనోటిఫ్యూరాన్‌లలో ఏదైనా వాడవచ్చని సూచించారు. ఎర్ర నల్లి తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం పొడి లేదా కైకోఫాల్ 5ఎంఎల్, కానీ స్పైరోమెసిఫిన్ 1ఎంఎల్‌లలో ఏదైనా వాడవచ్చని తెలిపారు. వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఎన్ఎస్ఎస్ విభాగం వలంటీర్లు మంగళవారం దుగ్గిరాల మండల పరిధిలోని శృంగారపురం గ్రామంలో సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ కాలేజ్ ఆఫ్ సైన్స్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రోజుకో కొత్త పంథాలో జరుగుతున్న సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే.. వాటిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఎక్కువగా ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్, టెలిగ్రాం, ఓఎల్ఎక్స్ తదితర సోషల్ మీడియా ద్వారానే ఈ నేరాలు జరుగుతున్నాయన్నారు. ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులు కూడా వీరి ఉచ్చులో పడి మోసపోతున్నారని బీసీఏ విభాగాధిపతి డాక్టర్ కె. భగవాన్ వివరించారు. సైబర్ నేరాలకు గురైతే భయపడకుండా 1930 ప్రభుత్వ కాల్ సెంటర్‌కి ఫోన్ చేసి, ఫిర్యాదు చేయాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.ఉషారాణి తెలిపారు. వలంటీర్లను, ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ పి.సురేష్, వర్సిటీ వీసీ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, స్టూడెంట్ అఫైర్స్ డీన్‌లు డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మేడికొండూరు: మండలంలోని డోకిపర్రు అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో తోట చందన ఆకస్మిక తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం వండుతున్నారా లేదా అని పరిశీలించారు. ఆహారం రుచి చూశారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10 వేలతో పోషణ వాటిక, రూ.16 వేలలో వర్షపు నీటి నిల్వ నిర్మాణాలు, రూ.17 వేలతో తాగునీటి కనెక్షన్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది తోట శివ పార్వతి, గుంటుపల్లి నాగలక్ష్మి పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న ఉచిత ఇసుక

రెచ్చిపోతున్న దళారులు

- గ్రామాల్లో ఇసుక నిల్వలను అమ్మేస్తున్నారు!
- ఉచిత ఇసుకకు అనుమతి 10 కి.మీ మాత్రమే
- తెనాలి, గుంటూరుకు ట్రాక్టర్లతో తరలిస్తున్నారు
- ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు ప్రేక్షకపాత్ర



కొల్లిపరలో పొక్లయినర్‌తో ట్రాక్టరులో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

కొల్లిపర: ఉచిత ఇసుక విధానం దళారులకు కాసులు కురిపిస్తోంది. గ్రామాల్లో నిల్వ చేసుకున్న ఇసుకను అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో ఉచిత ఇసుకను తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఇందుకు అవకాశంగా తీసుకున్నారు. అయితే అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. నదికి, వాగులు, వంకల్లో ఆనుకొని ఉన్న గ్రామాల్లో అక్కడి ప్రజల అవసరాల నిమిత్తం 10 కిలో మీటర్లు లోపు వారికి అందుబాటులో ఉన్న ఎండ్ల బండి, ట్రాక్టర్లు ద్వారా ఇసుకు తీసుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. ఎండ్ల బండి, ట్రాక్టర్‌తో ఇసుక తరలింపు విషయంలో మంత్రులు, కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, పోలీసులు పటించు కోవద్దని చెప్పారు. ఉచిత ఇసుక విధానంలో ఇంతకు మించి ఎటువంటి విధి విధానాలను స్పష్టంగా తెలియజేయలేదని చెబుతున్నారు. ఇసుక అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ, పోలీసులు చేసేదేమిలేక ఊరుకుంటున్నారు. కొల్లిపర మండలంలో గత మూడు రోజుల నుంచి ఇసుక తరలింపు కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాల కారణంగా కృష్ణానదికి నీటి ప్రవాహం పెరిగింది. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు నీరు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో రెండు లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. నదిలో ఇసుక తీయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో కూటమి నాయకులు, ఇసుక దళారులు గ్రామాల్లో ఉన్న ఇసుక నిల్వలపై దృష్టి సారించారు. గ్రామంలో ఎక్కడైనా ఇసుక నిల్వలు కనిపిస్తే చాలు... వారి వద్దకు వెళ్లి బేరాలు సాగిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.2 వేల నుంచి రూ.2.500 వరకు కొనుగోలు చేస్తున్నారు. కృష్ణా నదిలో వరద ప్రవాహం తగ్గిన వెంటనే ఉచిత ఇసుక విధానంలో మళ్లీ ఇసుక తోలుతాం అని హామీనిస్తున్నారు. ఆ విధంగా వారి నుంచి ఇసుకను తక్కువ ధరకు కొనుగోలు చేసి, తెనాలి, గుంటూరు వంటి పట్టణాలు, నగరాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. తెనాలిలో ట్రాక్టర్ రూ.4–5 వేల వరకు, గుంటూరు జిల్లా కేంద్రంలో ట్రాక్టర్ రూ.7–8 వేల వరకు అమ్ముతున్నారు.

గ్రామస్తుల వ్యక్తిగత, సామూహిక అవసరాల కోసం ఉచిత ఇసుక విధానంగా ప్రభుత్వం ప్రకటిస్తే, అందుకు భిన్నంగా ఇసుకను వ్యాపార సరుకుగా మార్చేశారు. గ్రామాల నుంచి పట్టణాలు, నగరాలకు అమ్ముతున్నారు. చివరకు రోడ్డు కాంట్రాక్టరు నిల్వ ఉంచిన ఇసుకను కూడా దళారులు కొనుగోలు చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఉచిత ఇసుక విధానంలో తగిన విధి విధానాల్లో స్పష్టత లేకపోవటంతో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. వాటిపై ప్రభుత్వ శాఖలకు తగిన గైడ్ లైన్స్ ఇవ్వాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేకుంటే దళారులకు అడ్డుకోవటం అధికారులకు సాధ్యంకాదు. పైగా ముందు నదినుంచి ఇసుక తీసే విషయంలోనూ విభేదాలు, గొడవలు జరిగే ఆస్కారం ఉందంటున్నారు.

ఉచితం స్థానిక అవసరాలకు మాత్రమే



ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో భాగంగా నదీ పరీవాహక ప్రాంతంలో స్థానిక అవసరాల మేరకు ఎండ్ల బండి, ట్రాక్టరులు ద్వారా తరలించేందుకు మాత్రమే అనుమతిచ్చింది. ఇసుక తరలించే సమయంలో వాహనాలు ఎన్ని కిలోమీటర్లు వరకు తరలించవచ్చు వంటి నిబంధనలు ఇంకా రాలేదు. గ్రామంలో నిల్వ ఉన్న ఇసుక గుట్టలు తరలించే విషయంపై ఎటువంటి ఆదేశాలు లేవు. వాటికి మాకు ఎటువంటి సంబంధం లేదు.

– జి.సిద్ధార్థ, తహసీల్దారు

ఎండ్ల బండి, ట్రాక్టర్లకు మాత్రమే అనుమతి



ఫ్రీ ఇసుక విధానంతో ప్రభుత్వం ఇటీవల నది, వాగులు, వంకల్లో స్థానిక అవసరాల మేరకు వారి సొంత ఎండ్ల బండి, ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకోవచ్చని పేర్కొంది. దీంతో గత నాలుగు రోజులుగా స్థానికంగా ఇసుక ట్రాక్టరులు ఆపటం లేదు. గ్రామంలో ఇసుక నిల్వ ఉంచిన వ్యక్తులు వారు ఇసుక తరలించే విషయంపై అడ్డుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు మాకు రాలేదు.

–పి.కోటేశ్వరరావు, ఎస్ఐ

నహరే నిగర్ సుల్తానాకు అభినందనలు



నహరే నిగర్ సుల్తానాను అభినందిస్తున్న మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్

తెనాలిఅర్బన్: మెప్మా ఆధ్వర్యంలో విజయ నగరంలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో ఎక్కువ అమ్మకాలు జరిపిన స్వయం సహాయక సంఘ సభ్యురాలు తెనాలివాసి సయ్యద్ నహరే నిగర్ సుల్తానాను మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ అభినందించినట్లు తెనాలి సీఎంఎం విజయ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అఖిల భారత సారస్ ఎగ్జిబిషన్‌ను విజయ నగరం నిర్వహించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అక్కడ 28 స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో 47 స్వయం సహాయ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించినట్లు వివరించారు. తెనాలికి చెందిన సయ్యద్ నహరే నిగర్ సుల్తానా క్రిస్టల్ బ్యాగ్, ఆర్టిఫిషియల్ జ్యూయలరీ ప్రదర్శనలో ఉంచి విక్రయించడం ద్వారా రూ.2,67,000 లు లభించిందని చెప్పారు. అత్యధిక అమ్మకాలు జరిపిన ఆమెను బుధవారం విజయవాడలోని మెప్మా ప్రధాన కార్యాలయంలో మిషన్ డైరెక్టర్ అభినందించారు.

వైభవంగా శ్రీసాయిక్షేత్రం వార్షికోత్సవం



బాబాకు హారతి ఇస్తున్న అర్చకస్వామి

తెనాలి: రూరల్ మండల గ్రామం నందివెలుగులోని షిర్డీ సాయిబాబా మందిరం 'శ్రీసాయి క్షేత్రం'లో మంగళవారం 12వ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం కాకడ హారతితో మొదలై, సాయిబాబా, దత్తాత్రేయ స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ సుగంధ ద్రవ్యాధి సహిత పంచామృత అభిషేకం నిర్వహించారు. తెనాలికి చెందిన శారదా చలపతి బృందంచే శ్రీసాయినామ సంకీర్తన భక్తులకు శ్రవణానందం కలిగించింది. విశిష్ట అతిథులచే శ్రీషిర్డీ సాయినాథుని లీలా ప్రవచనామృతం'తదుపరి మధ్యాహ్న హారతిని వెంపటి చిన సత్యనారాయణ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సంధ్య హారతి తదుపరి సాయినాథుని ఊరేగింపు ఉత్సవం నందివెలుగు పురవీధుల్లో సన్నాయి మేళాలు, కీర్తనలు, కోలాటం, నృత్యాలతో కొనసాగింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఊరేగింపును సందర్శించి, స్వామిని దర్శించుకున్నారు. ఇటీవల దసరా శరన్నవ రాత్రుల్లో భాగంగా బాలబాలికలకు నిర్వహించిన బాబా సచ్చరిత్ర, శ్రీసాయిబాబాపై క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. శ్రీసాయిబాబా పవళింపు సేవ అనంతరం శేజ్ హారతితో కార్యక్రమాలను ముగించారు. శ్రీసాయి క్షేత్రం చైర్మన్ ఆదిపూడి సాయిరాం, ఎ.సాంబశివరావు, వెంపటి చిన్న సత్యనారాయణ, టి.శ్రీనివాస్ బాబు, శారదా చలపతి, కార్యదర్శి ఎం.శ్రీవల్లీ అన్నపూర్ణ, సుకుమార్, పార్వతి, సీహెచ్ పద్మావతి, ఎంవీఎల్ సాయికృష్ణ, ఎంవీఎల్ ఫణి కృష్ణ పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయ కేంద్రంగా టీజే కాలేజీ మైదానం

వ్యాపారులతో అధికారుల సమావేశం



కాలేజీ మైదానాన్ని పరిశీలిస్తున్న అధికారులు



వ్యాపారులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

తెనాలి: దీపావళి పర్వదినం సందర్భంగా ఏర్పాటుచేసే బాణాసంచా విక్రయ కేంద్రంగా స్థానిక కొత్తపేటలోని టీజే కాలేజీ మైదానాన్ని ఎంపిక చేశారు. స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం బాణాసంచా హోల్‌సేల్ / రిటైల్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటుచేశారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పాల్గొన్నారు. బాణాసంచా స్టాల్స్ ఏర్పాటుకు అనువైన ప్రదేశంపై జరిగిన చర్చల్లో వ్యాపారుల వినతి ప్రకారం టీజే కాలేజీ మైదానంలో నిర్వహించేందుకు అధికారులు అంగీకారం తెలిపారు. అక్కడైతే వినియోగదారులకూ అందుబాటులో ఉంటుందనే భావన వ్యక్తమైంది. బాణాసంచా అమ్మకాల లైసెన్సు కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలోనే సింగిల్‌విండో విధానంలో అనుమతిని ఇస్తామన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు వీధుల్లో విక్రయించే నిమిత్తం తోపుడు బండ్ల వ్యాపారులకు బాణాసంచాను కేటాయించరాదని ఆదేశించారు. బాణాసంచా విక్రయ దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలను నియమించరాదని చెప్పారు. బాణాసంచా వ్యాపారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. బాణాసంచా దుకాణాలు ఎల్ ఆకారంలో ఏర్పాటు చేయాలనీ, ఒక్కో దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని చెప్పారు. ప్రతి దుకాణంలోనూ ఇసుక బకెట్లు, నీటి వసతిని అందుబాటులో ఉంచుకోవటం తప్పనిసరిగా తెలియజేశారు. దీనికి ముందు ఉదయం పట్టణంలోని టీజే కాలేజీ, వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీ మైదానాలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు.

మహాసభలను జయప్రదం చేయండి

సీపీఐ తెనాలి కార్యదర్శి సింగారావు



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో కృష్ణ, సింగారావు

తెనాలిఅర్బన్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో గుంటూరులో జరిగే జిల్లా మహాసభల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణలు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ తెనాలి నియోజకవర్గ కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పోరాట పటిమలను కలిగి ఉండాలన్నారు. సమస్యలపై పోరాటాలు చేస్తూ వాటిని సాధించే దిశగా ప్రయత్నించాలని సూచించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కరించడంలో తమ సంస్థ ముందు ఉందని తెలిపారు. అనంతరం తెనాలి నియోజకవర్గ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గండు శివ, కార్యదర్శిగా చెన్నూరి సాయి, సహాయ కార్యదర్శిగా పొన్నెకంటి శోభిత్, ఉపాధ్యక్షుడిగా కుర్రా పవన్, కోశాధికారిగా భూమేష్, కార్యవర్గ సభ్యులుగా దినేష్, జయదీప్, తేజ, మదన్‌మోహన్‌లను ఎన్నుకున్నారు. వీరిని నాయకులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు కనపర్తి బెనహర్ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తాడికొండ: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏవీవీ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 19 నుంచి 21 వరకు అనంతపురంలోని నార్పలలో జరిగిన 43 వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ షూటింగ్ బాల్ పోటీలలో విద్యార్థులు రాంప్రకాష్, ఫయాజ్, ఏడుకొండ పాల్గొన్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లా జట్టు ప్రాతినిధ్య వహించారని, విజేతలుగా నిలిచారని తెలిపారు. రాష్ట్ర జట్టుకు రాంప్రసాద్, ఫయాజ్ ఎంపియ్యారన్నారు. ఇది తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. శిక్షణ అందించిన పీఈటీ సుంకర శ్రీనివాస్, క్రీడాకారులను స్కూల్ చైర్మన్ మార్కంపూడి రవి, హెచ్ఎం ఘనంగా సత్కరించారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుండి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి పెదవడ్లపూడి స్టేషన్ల మధ్య మోరంపూడి రైల్వే గేటు సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని మంగళవారం పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. రైల్లో నుండి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి జేబులో గౌహతి నుండి కోయంబత్తూర్‌కు తీసుకున్న టికెట్ ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలన్నారు.

విధులకు సకాలంలో హాజరుకావాలి

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: విధులకు సకాలంలో హాజరుకావాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 21,22,27 వార్డులలో మంగళవారం ఉదయం పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే 9వ శానిటేషన్ డివిజన్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అటెండెన్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లవారుజామున సమయంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులకు ఎటువంటి అటకం ఉండదని తెలిపారు. ఆ సమయంలో తమకు కేటాయించిన ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పలువురు సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు రాంబాబును హెచ్ఎం తాడిరెడ్డి మంగళవారం ఘనంగా సత్కరించారు. తాతిరెడ్డి మాట్లాడుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయుల ఆటల పోటీల్లో 400 మీటర్ల నడక పోటీల్లో జిల్లా స్థాయిలో మూడవ స్థానం సాధించారని చెప్పారు. ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, అనిల్‌కుమార్, అన్వర్ పాల్గొన్నారు.

విష మొక్కలు తిని 12 గొర్రెలు మృతి



విషం మొక్కలను తిని మృతి చెందిన గొర్రెలు

తూములూరు(కొల్లిపర): విషం మొక్కలు తిని 12 గొర్రెలు మృతి చెందిన సంఘటన మంగళవారం తూములూరు గ్రామంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని తూములూరు గ్రామ శివారు లంబాడిపాలెంకు చెందిన బాణవత్ బుషి నాయక్ తూములూరు గ్రామంలోని ప్రధాన కూడలిలో ఒక ఖాళీ స్థలంలోకి గొర్రెలన్నింటినీ పచ్చి మేత కోసం పంపించాడు. పంపించిన 10 నిముషాల్లో సుమారు 12 గొర్రెలు మృత్యువాతకు గురయ్యాయి. ఏం జరిగిందే తెలియక వెంటనే మండల పశువైద్యులకు సమాచారం ఇవ్వగా కంపౌండర్ వెంటనే సంఘటన స్థలానికి వచ్చి బతికి ఉన్న గొర్రెలకు ప్రథమ చికిత్స చేశారు. మృతి చెందిన వాటిని కొల్లిపరలోని పశు వైద్యశాలకు తరలించారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ సాయి సతీష్‌రాజు, తూములూరు జూనియర్ వెటర్నర్ ఆఫీసర్ డాక్టర్ సుభాని మృతి చెందిన మేక పోతులకు పోస్ట్ మార్టర్ చేయగా అవి విషం ఉన్న మొక్కలు తినటం వలన మృత్యు వాతపడ్డాయని గుర్తించారు. ఇదే స్థలంలో 15 రోజుల క్రిందట వేరొక మేకల కాపరికి చెందిన మూడు మేకలు మృతి చెందడం గమనార్హం. రెండేళ్ల కిందట కూడా ఇలాగే నాలుగు గొర్రెలు మృతి చెందిన సంఘటన గుర్తు చేసుకున్నారు. మృతి చెందిన 12 గొర్రెలు విలువ సుమారు రూ.3 లక్షలుగా అంచనా వేశారు.

టీచ్ టూల్ అబ్జర్వేషన్ త్వరగా పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: టీచ్ టూల్ అబ్జర్వేషన్ త్వరగా పూర్తి చేయాలని ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు సూచించారు. కొత్తపేటలోని మండల విద్యాధికారి కార్యాలయంలో మంగళవారం టీచ్ టూల్, టీపీడీ మ్యాథ్స్ కోర్స్ కోర్సులపై సమీక్ష జరిపారు. గత నెలలో నిర్వహించిన రివ్యూలో సూచించిన విధంగా పలు ప్రభుత్వ పాఠశాలలో అబ్జర్వేషన్ పూర్తి కాకపోవడంపై కొంత అసహనం వ్యక్తం చేశారు. నవంబర్ నాటికి మొత్తం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ తోట వీరయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి

ఏడీఏ ఎస్. ఉషారాణి



ఎలుకల నివారణ గురించి వివరిస్తున్న ఏడీఏ ఉషారాణి

తెనాలిరూరల్: ప్రతి రైతు ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని, దీని ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఏడీఏ ఎస్. ఉషారాణి తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో ఎలుకల నివారణ మందు తయారీని రైతులకు వివరించారు. బుర్రిప్రాలెంలో జరిగిన కార్యక్రమంలో తెనాలి వ్యవసాయ సహాయ సంచాలకురాలు ఉషారాణి పాల్గొన్నారు. ఎలుకల నివారణ కోసం బ్రోమోడయోలిన్ మందు తయారీ గురించి రైతులకు వివరించారు. 100 గ్రాముల మందు కోసం రెండు గ్రాముల బ్రోమోడియాలిన్ మందు, రెండు గ్రాముల నూనె, 96 గ్రాముల నూకలను తీసుకొని వీటిని అన్నింటినీ కలపాలని చెప్పారు. తయారు చేసుకున్న మందును పది గ్రాములు చొప్పున ఒక్కొక్క ప్యాకెట్‌గా పేపర్‌లో మడతపెట్టి ఎలుకల బొరియల్లో వేయాలని సూచించారు. కంచర్లపాలెంలో తెనాలి మండల వ్యవసాయ అధికారి జి. ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

ఎలుకల నివారణతో దిగుబడులు

కొల్లిపర: వరి పంటలో రైతులు అందరూ కలసి సామూహికంగా ఎలుకల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు అన్నారు. వరి పంటలో సామూహిక ఎలుకల నివారణ కోసం మంగళవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉచితంగా రైతులకు బ్రోమోడేయోలిన్ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సూరత్‌కు అంబేడ్కర్ కాంస్య విగ్రహాలు



అంబేడ్కర్ విగ్రహాలతో వెంకటేశ్వరరావు, రవిచంద్ర

తెనాలి: పట్టణ శిల్పకళకు జాతీయస్థాయి గుర్తింపు తీసుకొచ్చిన స్థానిక సూర్య శిల్పశాల, కాటూరి ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు రవిచంద్ర తాజాగా డాక్టర్ బాబాసాహెచ్ అంబేడ్కర్ ఫైబర్‌గ్లాస్, కాంస్య విగ్రహాలను రూపొందించారు. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ పట్టణంలో ప్రతిష్ట నిమిత్తం తయారుచేసిన ఈ విగ్రహాలను మంగళవారం ప్రత్యేక వాహనంలో అక్కడకు తరలించారు. గతంలో కుర్చీలో కూర్చున్నట్టు రూపొందించిన అంబేడ్కర్ విగ్రహాన్ని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు పంపగా, వచ్చిన ఆదరణతో ఇప్పుడు సూరత్ నుంచి ఆర్డరు వచ్చినట్టు కాటూరి తెలియజేశారు. ఏడున్నర అడుగుల ఫైబర్‌గ్లాస్ విగ్రహంతోపాటు నాలుగున్నర అడుగుల ఎత్తులో రెండు కాంస్య విగ్రహాలకు 1300 కిలోల కాంస్యాన్ని వినియోగించి, తయారీకి మూడు నెలల సమయం పట్టినట్టు వివరించారు.

నేడు ఎలుకల నివారణ మందు పంపిణీ

కర్లపాలెం/వేమూరు/చెరుకుపల్లి: సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం కర్లపాలెం మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా రైతులకు అందజేస్తామని వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి మంగళవారం తెలిపారు.